క్లుప్తంగా

13న కలెక్టరేట్ ఎదుట నిరసన

నాగర్‌కర్నూల్ రూరల్: భారత అత్యున్నత న్యాయస్థానం జడ్జి సీజేఐపై జరిగిన దాడికి నిరసనగా 13న కలెక్టర్ కార్యాలయాల ముందు ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయా సంఘాల నాయకులు తెలిపారు.

బాలిక హక్కులను కాపాడుకోవాలి



లింగాల: బాలికలు చదువుల్లో రాణించి హక్కులను కాపాడుకోవాలని ఎస్ఐ వెంకటేశ్వర్ గౌడు అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాలికలు చదువులతో పాటు హక్కులను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓ శారద, ఆంజనేయులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



పెద్దకొత్తపల్లి: చంద్రకళ్ గ్రామానికి చెందిన బండి వెంకటస్వామి కూతురు బండి శ్రవంతికి నీట్‌లో 5496 ర్యాంక్ సాధించి భూపాలపల్లి జిల్లా మెడికల్ కళాశాలల్లో ఎంబీబీఎస్ సీటును పొందింది. చంద్రకళ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిబాబ, బాలకృష్ణలు శాలువాతో విద్యార్థినిని సన్మానించారు. కార్యక్రమంలో హరికృష్ణ, రామస్వామి, వెంకటస్వామి పాల్గొన్నారు.

కిరాణా దుకాణాల్లో మద్యం అమ్మకాలు

కోడేరు: మండలంలో కిరాణ షాపుల పేరుతో నడుస్తున్న షాపుల్లో మద్యం విక్రయాలు జోరుగాసాగుతున్నాయి. బయట షాపుల పేర్లు కిరాణం పెట్టి షాపుల్లో పూర్తిగా మద్యం అమ్మకాలు చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని మహిళలు మండిపడుతున్నారు. వెంటనే ఎక్సైజ్ అధికారులు స్పందించి గ్రామంలో కిరాణ దుకాణాలపై దాడులు నిర్వహించి మద్యం విక్రయించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సీజనల్‌గా పశువులకు వ్యాపించే వ్యాధుల నివారణపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పాడి గేదెలతో పాటు వ్యాధుల నివారణ కోసం టీకాలు వేయించుకోవాలన్నారు. గ్రామాలకు వచ్చే పశువైద్య సిబ్బందికి రైతులు సహకరించాలని అన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని ఐదు కేంద్రాల్లో భగవద్గీత కంఠస్థ, భావ విశ్లేషణ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ జిల్లా కార్యక్రమ నిర్వాహకులు రామాచారి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూడు విభాగాల్లో భగవద్గీత కంఠస్థ పోటీలు ఉంటాయన్నారు. మొదటి గ్రూప్‌లో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు 14వ అధ్యాయం గుణత్రయ విభాగ యోగం, రెండో గ్రూప్‌లో పదో తరగతి నుంచి ఇంటర్ వరకు 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగ యోగం, మూడో గ్రూప్‌లో 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వారికి నిత్య జీవితంలో భగవద్గీత భావ విశ్లేషణపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 8, 9 తరగతులకు, 18 ఏళ్లలోపు 18 ఏళ్లు పైబడిన వారికి సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. నవంబర్ 11న నారాయణపేటలోని గీతా భారతి స్కూల్, 18న గద్వాలలోని శ్రీసరస్వతి టాలెంట్ స్కూల్, 23న వనపర్తి జిల్లా తాటిపాములలోని శ్రీరీతాంబర విద్యాలయం, 25న మహబూబ్‌నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో, 27న నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో కంఠస్థ, భావ విశ్లేషణ పోటీలు ఉంటాయని చెప్పారు. ఈ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

శిథిలావస్థకు సర్కారు బడి



అసంపూర్తిగా ఉన్న బొమ్మలగుడిసెలు పాఠశాల భవనం



పాఠశాల పైపెచ్చులూడి నీరు కారుతున్న పైకప్పు



వర్షానికి తరగతి గదిలో చేరిన నీరు

- పెచ్చులూడుతున్న బొమ్మలగుడిసెలు పాఠశాల పైకప్పు
- భయాందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు

చారకొండ: ప్రభుత్వం పాఠశాల భవనాలు, విద్యార్థుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోంది. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో పాఠశాల భవనాల మరమ్మతులకు, ఇతరత్రా పనుల నిమిత్తం నిధులు విడుదల చేస్తుంది. కానీ విద్యాశాఖ అధికారులు అలసత్వం కారణంగా ప్రభుత్వ ఆశయానికి గండి పడుతోంది. చారకొండ మండలంలోని 22 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, అందులో రెండు ఉన్నత పాఠశాలలు, 1 కేజీబీవీ, 4 యూపీఎస్ పాఠశాలలు, 15 ప్రాథమిక పాఠశాలలున్నాయి. అన్ని పాఠశాలలో 1600 లకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

శిథిలావస్థలో ప్రాథమిక పాఠశాల..

మండలంలోని బొమ్మలగుడిసెలు గ్రామంలో ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. పాఠశాల పైకప్పు పెచ్చులూడుతోంది. వర్షాకాలంలో వర్షపు నీరు స్లాబ్, గోడల నుంచి రావడంతో భవన నిర్మాణం దెబ్బతింటోంది. వర్షాలు లేని సమయంలో కాస్త మెరుగ్గా ఉన్నా, వర్షాకాలంలో మాత్రం విద్యార్థులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. ప్రస్తుతం పాఠశాలలో 30 మంది విద్యార్థులున్నారు.

విద్యార్థులకు రక్షణ లేదు..

గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రహరీ లేకపోవడంతో వర్షం వచ్చిందంటే పాఠశాల నుంచి వరద ప్రవాహం, చుట్టు ఏపుగా పిచ్చి మొక్కలు పెరగడంతో పాఠశాల ఆవరణలో పాములు, కీటకాలు సంచరిస్తున్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

అసంపూర్తిగా గదుల నిర్మాణం..

గత ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ.28 లక్షల మంజూరు చేయగా, గదుల నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. భవన నిర్మాణంపై కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా, ఇప్పటి వరకు చేసిన పనుల బిల్లులు రాలేదని పేర్కొన్నారు.

అధికారుల అలసత్వం..

బొమ్మలగుడిసెలు ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరినప్పటికీ విద్యాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పాఠశాలకు తక్షణమే మరమ్మతు చేయించాలి. పాఠశాల అసంపూర్తిగా ఉన్న గదుల నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

14వ విడత ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రారంభం

ఉప్పునుంతల: మండలంలో 14వ విడత ఈజీఎస్ సామాజిక తనిఖీ శనివారం ప్రారంభమైంది. తనిఖీ బృందాలు గ్రామాలకు వెళ్లి రికార్డు ఆధారంగా తనిఖీ చేస్తున్నారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు మండలంలో ఈజీఎస్ నిధులు రూ.5.11 కోట్లతో చేపట్టిన 555 పనులపై తనిఖీ చేపట్టనున్నారని ఎంపీడీఓ మోహన్‌లాల్ తెలిపారు. వాటిలో రూ.4.88 కోట్లు కూలీలకు సంబంధించి, రూ.23.12 లక్షలు మెటీరియల్‌కు సంబంధించిన నిధుల ఖర్చుపై సామాజిక తనిఖీ చేయనున్నారని ఎంపీడీఓ తెలిపారు.

సమావేశం విజయవంతం చేయండి

మన్ననూర్: హైదరాబాద్‌లో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ (సంఘం) ప్రక్షాళనను ఉద్దేశించి నిర్వహిస్తున్న సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకుడు సంబు వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం హైదరాబాద్‌లోని వేడుక కన్వెన్షన్ హాల్లో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరుగుతంది. ఈ క్రమంలో ఆర్యవైశ్యుల భవిష్యత్ కార్యచరణతో పాటూ ఎంతో కాలంగా కొందరు స్వార్థపరుల కభంధ హస్తాలలో బంధీగా ఉన్న ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కమిటీని ప్రక్షాళనల చేసేందుకు సమావేశం నిర్వహిస్తున్నందున రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఆర్యవైశ్య సంఘాల నాయకులు విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటుకు చేయూత



కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు గ్రామ మాజీ సర్పంచ్ చెన్ రెడ్డి పవన్ కుమార్ రెడ్డి ముందుకొచ్చారు. నేరాల అదుపులో సీసీ కెమెరాల పాత్ర ముఖ్యమైనదని, అందుకోసం గ్రామంలో ఏర్పాటు చేస్తే అన్ని కెమెరాలకు రూ.7లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామంలో ఎలాంటి సంఘటనలైనా రికార్డు అవుతాయన్నారు. కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన మాజీ సర్పంచ్ పవన్ కుమార్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో నిజాముద్దీన్, ప్రశాంత్, జహంగీర్, యూసఫ్, కావలి మల్లేష్, సుధాకర్, మహేష్, కొండల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాతల సహకారం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతలు సహకరిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి తెలిపా రు. శనివారం ఆలయంలో పూజలు చేసిన కర్ణాటక వాస్తవ్యులు వెంకటస్వామి, దుర్గాప్రసాద్, వెంకటేష్, శశికళ, కల్వకుర్తికి చెందిన లావణ్య, నాగేశ్వర్ దంపతులు రూ. 11వేల 116ల చొప్పున విరాళం అందజేశారు. దాతలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస రావు, పూజారి వీరయ్యశాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ మల్లు రవికి వినతి

పెద్దకొత్తపల్లి: పెద్దకొత్తపల్లి జెడ్పీటీసీ స్థానాన్ని తనకు కేటాయించాలని కోరుతూ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య శనివారం నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లురవికి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

పరామర్శించిన నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: ఇటీవల నిమ్స్‌లో గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న రాధాకృష్ణను మాలమహానాడు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, పలువురు దళిత సంఘాల నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో వెంకటయ్య, చింత సత్తి, సామ మహేష్,ఆంజనేయులు,మైబు, కు రుమయ్య, ఆంజనేయులు, శ్రీకాంత్ ఉన్నారు.

కులం పేరుతో దూషిస్తే కఠిన చర్యలు



కుల వివక్షతపై గ్రామంలో అవగాహన కల్పిస్తున్న సీఐ

తెలకపల్లి: కులం పేరుతో ఇతర కులాల వారిని దూషిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ సీఐ, తహసీల్దార్ జాకిర్ అలీ, ఎస్ఐ నరేష్ అన్నారు. శనివారం మండలంలోని జంగమోనిపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నెల కొన్న ఇరువర్గాల వివాదాన్ని వారు గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఇటీవల దసరా పండగ సందర్భంగా దుర్గమాతను ఏర్పాటు చేశారు. అక్కడ ఒక కులానికి చెందిన వారిని దుర్గమాత దర్శనానికి రానివ్వలేదు. అక్కడ కుల వివక్ష చూపించారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. గ్రామంలో ఎవరినైనా కులం పేరుతో దూషించినట్లయితే వారిపైన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు మారుతున్న సమాజానికి అనుగునంగా మారాలన్నారు. ఎవరినైనా కూలంపేరుతో దూషించినట్లయితే వారిపైన ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామన్నారు. అందరికి అన్ని దేవాలయాల్లో పూజలు చేసుకునే హక్కు ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, నరేందర్, గ్రామంలో అన్ని కులాలకు సంబంధించిన గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

అధ్వానంగా పల్లె రహదారులు



పోల్కూరు సమీపంలో బీటలు వారిన రోడ్డు

పెద్దకొత్తపల్లి: పెద్దకారుపాముల నుంచి ముష్టిపల్లికి వెళ్లే పల్లె రహదారి అధ్వానంగా తయారై రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పెద్దకొత్తపల్లి నుంచి మరికల్‌కు వెళ్లే రహదారి కూడా వాహనాలు వెళ్లేందుకు సౌకర్యంగా లేక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి నుంచి బాచారం వెళ్లే రహదారి గుంతల మయంగా ఏ ర్పడి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నా యి. గంట్రావుపల్లి నుంచి జొన్నలబొగుడ రహ దారి అధ్వానంగా మారింది. సాతాపూర్ నుంచి కోడేర్‌కు వెళ్లే రహదారి గుంతల మయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారుల మరమ్మతు విషయంపై ఎంపీడీఓ నాగేందర్‌ను వివరణ కోరగా, పల్లె రహదారుల మరమ్మతు కోసం పీఆర్ డిపార్టుమెంట్‌కు ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేపడ్తామని ఎంపీడీఓ తెలిపారు.

తాడూరు: మండల కేంద్రంలో ఆయా గ్రామాలు కలిపే లింకురోడ్లు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గుంతలు పడి రాకపోకలు అందోళన కరంగా మారాయి. మండల కేంద్రం నుంచి యాదిరెడ్డిపల్లి మీదుగా ఇంద్రకల్ ఐతోల్‌కు వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు ఇంద్రకల్ సమీపంలో గుంతలు పడి ప్రయాణం నరకయాతనగా మారింది. రాత్రి వేల రోడ్ల వెంట ప్రయాణం ఇబ్బంది కరంగా మారిందని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాలను కలిపే లింకురోడ్లు రోడ్డు అంచులు కొట్టుకుపోయి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అధికారులు పరిశీలించి తాత్కాలిక రోడ్ల మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల వాహనదారులు కోరారు.

అన్నను కాపాడబోయి తమ్ముడు..

- చెక్‌డ్యాంలో మునిగి ఇద్దరు సోదరుల మృతి
- చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..
- తల్లి ఏడాది దినకర్మ చేయడానికి వచ్చి మృత్యువాత
- వనపర్తి జిల్లా బలీదుపల్లిలో విషాదం



మంద సుధాకర్ (ఫైల్)



మంద సాయి (ఫైల్)

అడ్డాకుల: తల్లి చనిపోయి ఏడాది కావడంతో దినకర్మ చేయడానికి ఇద్దరు అన్నదమ్ములు పట్నం నుంచి ఊరికి వచ్చారు.. కార్యం పూర్తిచేసిన మరుసటి రోజు సరదాగా చేపలు పట్టేందుకు చెక్‌డ్యాం వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో నీటి సుడిలో మునిగిపోతున్న అన్నను కాపాడబోయి తమ్ముడు కూడా మృతిచెందిన విషాదకర సంఘటన వనపర్తి జిల్లా బలీదుపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. బలీదుపల్లి గ్రామానికి చెందిన మంద యాదయ్య, మణెమ్మ దంపతులకు నలుగురు కుమారులు ఉన్నారు. అందరూ హైదరాబాద్‌లో ఉంటూ ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. అయితే గతేడాది మణెమ్మ చనిపోవడంతో ఏడాది దినకర్మ చేయడానికి నలుగురు కుమారులు కుటుంబాలతో కలిసి రెండు రోజుల కిందట బలీదుపల్లికి వచ్చారు. శుక్రవారం మణెమ్మ ఏడాది దినకర్మ పూర్తి చేశారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో పెద్ద కుమారుడు మంద సుధాకర్ (32), చిన్న కుమారుడు మంద సాయి(25) మరో తమ్ముడు మంద కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులందరూ కలిసి రెండు ఆటోల్లో గ్రామానికి సమీపంలో ఉన్న పెద్దవాగు చెక్‌డ్యాం వద్దకు వెళ్లారు. దుస్తులు శుభ్రం చేసుకుని కొద్దిసేపు సరదాగా గడిపొద్దామని అక్కడికి చేరుకున్నారు. అయితే చెక్‌డ్యాం దిగువన చేపలు కనిపించడంతో వెంటనే సుధాకర్ చేపలు పడతానంటూ నీళ్లలోకి దిగాడు. చెక్‌డ్యాం దిగువన నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో నీటి సుడి వద్దకు వెళ్లిన సుధాకర్ అందులో చిక్కుకుని మునిపోతూ కనిపించాడు. వెంటనే గుర్తించిన తమ్ముడు మంద సాయి నీళ్లలోకి దిగి అన్నను కాపాడే ప్రయత్నం చేయగా.. ఇద్దరూ నీటి సుడిలో చిక్కుకున్నాడు. ఇద్దరు అందులో కొట్టుమిట్టాడుతుండగా.. కొద్దిదూరంలో ఉన్న మరో తమ్ముడు మంద కుమార్ నీటిలోకి దిగి ఇద్దరిని కాపాడే ప్రయత్నం చేశాడు. ప్రాణాలకు తెగించి కుటుంబసభ్యుల సాయంతో ఇద్దరిని ఒడ్డుకు చేర్చగా.. పెద్ద కుమారుడు మంద సుధాకర్ అప్పటికే మృతిచెందాడు. కొన ఊపిరితో ఉన్న చిన్న కుమారుడు సాయిని అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించేలోగా మృతిచెందాడు. సుధాకర్‌కు భార్య మమత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సాయికి ఇంకా పెళ్లి కాలేదు. కాగా ఇద్దరు సోదరులు ఒకేరోజు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు గ్రామస్తుల చేత కంటతడి పెట్టించాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాలను జనరల్ ఆస్పత్రి మార్చురీలో ఉంచారు. ఆదివారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగిస్తామని తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది. తల్లి దినకర్మకు వచ్చిన కుమారులను మృత్యువు కబలించడంతో బంధువులు తీరని శోకసంద్రంలో మునిగిపోయారు.

దర్గా వద్ద ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



వెల్దండలో దర్గావద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: మండల కేంద్రంలోని హైదరాబాదు-శ్రీశైలం జాతీయ రహదారిలో ఉన్న దర్గా వద్ద శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పార్టీ కార్యకర్తలతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మతాలకు అతీతంగా దర్గాల వద్ద భక్తులు చేస్తారన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సింగల్‌విండో డైరెక్టర్లు సంజీవ్‌కుమార్‌యాదవ్, మట్ట వెంకటయ్యగౌడు, ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, నాయకులు ఉన్నారు.

రైతులకు వరం.. ఈ-అన్నదాత క్యాంటీన్



లింగాల మండలం మగ్దూంపూర్‌లో ఈ-అన్నదాతపై అవగాహన కల్పిస్తున్న నిర్వహకులు

లింగాల: సేవ్ ఎర్త్ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఈ-అన్నదాత క్యాంటీన్ రైతులకు, ప్రజలకు వరంలాంటిదని జిల్లా కో ఆర్డినేటర్ ఫెర్రీరాయ్, మండల ఇన్‌చార్జి సుధాకర్‌గౌడు తెలిపారు. మండలంలోని మగ్దూంపూర్‌లో శనివారం ఈ-అన్నదాత క్యాంటీన్‌పై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించారు. త్వరలో మండల కేంద్రంలో క్యాంటీన్ ప్రారంభించడం జరుగుతుందని జిల్లా కో ఆర్డినేటర్ తెలిపారు. ఈ క్యాంటీన్ ద్వారా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు ఇవ్వడం జరుగుతుందని, 50శాతం రాయితీపై నిత్యావసర సరుకులు విక్రయించడం, వడ్డీ లేకుండా ముద్ర రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ- అన్నదాత ద్వారా కార్డులను పొందాల్సి ఉంటుందని, కార్డులు కలిగిన సన్న చిన్నకారు రైతులు, ప్రజలకు మాత్రమే ప్రయోజనం చేకూరుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో లింగాల, అచ్చంపేట, బల్మూర్, ఉప్పునుంతల, అమ్రాబాద్ మండలాల ఏజెంట్లు నాగరాజు, కల్యాణ్, శ్రీకాంత్, ప్రభాకర్, బాలస్వామి పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని బాణాల గ్రామంలో శనివారం సేవ్ ఎర్త్ మిషన్ ఆధ్వర్యంలో జీవితబీమా, ముద్ర రుణాలు, అన్నదాత క్యాంటీన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవ్ ఎర్త్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ ఫె ర్రిరాయ్ మాట్లాడారు. కార్యక్రమంలో సేవ్ ఎర్త్ మి షన్ మండల కోర్డినేటర్ ప్రభాకర్, క్యాంటీన్ ఏజెంట్లు శ్రావణ్‌కుమార్, కల్యాణ్, రవి, ప్రశాంత్, ప్రవీ న్, అనిల్, బాలస్వామి, రైతులు పాల్గొన్నారు.

శివాలయాన్ని సందర్శించిన పోలీస్ అధికారులు



తెలకపల్లి: మండలంలోని ఆలేరు గ్రామంలో శివాలయాన్ని శనివారం పోలీసు అధికారులు సందర్శించారు. శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు శివాలయంలో ఉన్న శివలింగాన్ని పక్కకు జరపారని ఆలయ చైర్మన్ జంద్యాల రవీందర్‌రావు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశా రు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ సీఐ, ఎస్ఐ నరేష్‌తో కలిసి శివాలయాన్ని సందర్శించి పరిశీలించారు. ఇలాంటి చర్యలకు పాల్ప డితే శిక్షలు ఉంటాయని, చర్యలు తీసుకుంటామని సీఐ, ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిమ్‌లో యువకుడిపై దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: జిమ్‌లో యువకుడిపై కొందరు వ్యక్తులు అకారణంగా దాడికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ విషయం శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన అంద్రూస్ మండలంలోని గగ్గలపల్లి వద్ద ఉన్న సోలార్ ప్రాజెక్టులో పనులు చేసుకుంటున్నాడు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న జిమ్‌కు ప్రతిరోజు వ్యాయా మం చేసేందుకు వస్తుంటాడు. శుక్రవారం జిమ్ చేస్తుండగా అతడి చెయ్యి వేరే వ్యక్తికి తగలడంతో ఇరువురి మధ్య గొడవ పెద్దది కావడంతో హౌజింగ్‌బోర్డుకు చెందిన కార్తీక్, కౌశిక్, తరుణ్ అక్కడికి చేరుకుని అంద్రూస్‌పై దాడికి పాల్పడటంతో గాయాలయ్యాయి. జిమ్ నిర్వాకులు, స్థానికులు అంద్రూస్‌ను జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సంఘటనకు సంబంధించి ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా, బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెడ్డి సేవా సమితి భవన నిర్మాణానికి భూమిపూజ

కొల్లాపూర్: పట్టణంలోని బొంగరాలమిట్ట వద్ద పాలమూరు రెడ్డి సేవాసమితి కొల్లాపూర్ శాఖ కార్యాలయ భవన నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. రెడ్డి కులస్తుల సమావేశాలు, సేవా కార్యక్రమాలకు ఉపయోగపడేలా భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎద్దుల ప్రతాప్ రెడ్డి, బిచ్చారెడ్డి, బండి వెంకట్‌రెడ్డి, మేర్వారెడ్డి, అచ్చుతారెడ్డి, సంజీవరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, భీమిరెడ్డి, నర్సింహారెడ్డి, సత్యంరెడ్డి ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరికి గాయాలు

తిమ్మాజిపేట: తిమ్మాజిపేట గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. మారేపల్లి గ్రామస్తుల వివరాల ప్రకారం.. మారేపల్లికి చెందిన నేరళ్లపల్లి ఆంజనేయులు తిమ్మాజిపేట నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఎదురుగా మరో బైక్ వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరు కిందపడ్డారు. ఆంజనేయులు ముఖానికి, కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న దోమ వెంకటేష్ తన కారులో చికిత్స కోసం జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. త్రుటిలో ప్రాణాపాయం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కల్వకుర్తి టౌన్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వెనక నుంచి కారు ఢీ కొట్టడంతో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. వెల్దండ మండలంలోని కొట్రకు చెందిన వెంకటయ్య (46) తన సొంత పని నిమిత్తం కల్వకుర్తికి సాయంత్రం వచ్చాడు. తన పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్లేందుకు పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో బస్సు కోసం వేచి ఉన్నాడు. సమయం ఆలస్యమైందని బస్సులు దొరకవేమోనని నడుచుకుంటూ ఇంటికి బయలుదేరాడు. హైదరాబాద్ చౌరస్తా దాటిన తర్వాత ఉన్న మైసమ్మ ఆలయం వద్దకు అతను చేరుకోగానే వెనక నుంచి కారు వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత



వెల్దండ: మండలంలోని అల్లంతోటబావి తండాకు చెందిన ఇస్లావత్ జైపాల్‌నాయక్‌కు చెందిన పాడి ఆవు శనివారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. బాధితుల వివరాల ప్రకారం .. ఇస్లావత్ జైపాల్‌నాయక్‌కు చెందిన పాడిఆవు మేతమేస్తూ వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగతలు తగలడంతో అక్కడే మృత్యువాత పడింది. ప్రభుత్వ పరంగా రైతుకుటుంబాన్ని ఆదుకోవాలని తండావాసులు, నాయకులు కోరుతున్నారు.

పెంట్లవెల్లిలో సైడ్‌కాల్వలు ఏర్పాటు చేయండి



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో 6, 7 వార్డుల్లో మాలవీధి కాలనీలలో, కొత్త బస్టాండ్ సమీపంలో సైడ్ కాల్వలు ఏర్పాటు చేయాలని పెంట్లవెల్లి గ్రామస్తులు కోరుతున్నారు. సైడ్ కాల్వలు లేనందు వల్ల రోడ్ల పక్కనే మురుగు ప్రవహిస్తుండడంతో చుట్టు పక్కల కాలనీవాసులకు దుర్వాసన, దోమలతో ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులు స్పందించి సైడ్‌కాల్వలు మంజూరు చేసి కట్టించాల్సిందిగా కాలనీవాసులు కోరుతున్నారు.